ఆస్తమా చంపేసే రోగం కాదు..
చికిత్సతో నియంత్రించుకోవచ్చు

సినీ రచయిత, నటుడు తనికెళ్ల భరణి



కామినేని హాస్పిటల్స్‌లో ఉచిత ఆస్తమా స్క్రీనింగ్ క్యాంపులో మాట్లాడుతున్న తనికెళ్ల భరణి

మన్సూరాబాద్: ఆస్తమా చంపేసే రోగం కాదని, సరైన సమయంలో చికిత్స తీసుకుంటే నియంత్రించుకోవచ్చని సినీ రచయిత, నటుడు తనికెళ్ల భరణి అన్నారు. ప్రపంచ ఆస్తమా మాసోత్సవాల సందర్భంగా ఎల్‌బీనగర్ కామినేని హాస్పిటల్స్‌లోని ఇందిరా ఆడిటోరియంలో అందరికీ ఆస్తమా వైద్యం- ఉచిత ఆస్తమా అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఆయనతో పాటు కామినేని హాస్పిటల్స్ సీఓఓ డాక్టర్ గాయత్రి కామినేని, సీనియర్ పల్మానాలజిస్ట్ డాక్టర్ రవీంద్రారెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరై జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా తనికెళ్ల భరణి మాట్లాడుతూ, వైద్యం కంటే ముందు రోగిలో మనోధైర్యాన్ని నింపితే సగం జబ్బు నయమవుతుందన్నారు. ఆస్తమాతో తాను ఇబ్బందులు ఎదుర్కొన్నానని వైద్యుల సూచనలు, సలహాలతో 90శాతం మేర ఉపశమనం లభించిందని చెప్పారు. ఆరేళ్ల వయస్సు నుంచే దగ్గు ఆయాసం వచ్చేదని, దృఢ సంకల్పంతో వైద్యుల సలహాలు సూచనలతో ఆస్తమాను జయించవచ్చుననేందుకు తానే నిదర్శనమన్నారు. కామినేని హాస్పిటల్స్ సీనియర్ పల్మనాలజిస్ట్ డాక్టర్ రవీంద్రారెడ్డి మాట్లాడుతూ, ఆస్తమా వ్యాధిపై అవగహన ఉంటే విముక్తి పొందవచ్చని, ప్రజల్లో మరింత అవగహన కల్పించేందుకు ఉచిత ఆస్తమా శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. అనంతరం ఈ నెల 3 నుంచి 6వ తేది వరకు కామినేని హాస్పిటల్స్‌లో నిర్వహిస్తున్న ఉచిత ఆస్తమా స్క్రీనింగ్ క్యాంపు పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో హాస్పిటల్స్ వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యువకుడికి మూడు రోజుల జైలు

చాదర్‌ఘాట్: న్యూసెన్స్ కేసులో యువకుడికి న్యాయస్థానం జైలు శిక్ష విధించింది. చాదర్‌ఘాట్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శంకర్‌నగర్‌లో నివాసించే ఎస్.కార్తీక్ (19)పై చాదర్‌ఘాట్ పీఎస్‌లో న్యూసెన్స్ కేసు నమోదై ఉంది. బుధవారం ఈ కేసును విచారించిన నాంపల్లిలోని 6వ స్పెషల్ ఎంఎం న్యాయస్థానం మేజిస్ట్రేట్ ఎస్.లక్ష్మణ్‌రావు యువకుడికి మూడు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

ప్రపంచ మేధావి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్



జీఎస్ఐలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన ఏడీజీ జనార్ధన్‌ప్రసాద్, పీఎస్ఎన్ మూర్తి

మన్సూరాబాద్: జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ)లో ఆలిండియా జీఎస్ఐ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జీఎస్ఐ ఏడీజీ డి. జనార్ధన్‌ప్రసాద్, పీఎస్ఎన్ మూర్తి ముఖ్యఅతిథులుగా హాజరై జీఎస్ఐ ఆవరణలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జనార్ధన్‌ప్రసాద్ మాట్లాడుతూ, సంఘసంస్కర్త, న్యాయనిపుణుడు, ఆర్థికవేత్త, బహుభాషా వేత్త, తులనాత్మక మతాల ఆలోచనాపరుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని కొనియాడారు. అణగారిన వర్గాలకు, మహిళలకు హక్కులు కల్పించిన ప్రపంచ మేధావని, దేశానికి రాజ్యాంగాన్ని అందించిన మహా మేధావి అని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల అందించిన దళిత రత్న అవార్డులు పొందిన అసోసియేషన్ రీజినల్ సెక్రటరీ మధిర సత్యనారాయణ, శ్రీనివాసులును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీడీజీలు సంతోష్‌కుమార్ త్రిపాఠి, ఎస్ఎస్ మహాపాత్ర, అంశుమాన్ ఆచార్య, ఆర్‌పీ సింగ్, అనూప్ కాంబ్లీ, తారకేశ్వర్‌రావు, ప్రసాద్, కాబిరాజ్ సేఠీ, అసోసియేషన్ అధ్యక్షుడు ఆదర్ల మహేష్, ప్రతినిధులు లింగ్య, రాజశేఖర్, అరుణ్ కుమార్, చంద్రయ్య, చేకురేశ్వర్, అమరనాథ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం



లబ్ధిదారు భార్యకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

చంపాపేట: సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరంలాంటిదని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. వనస్థలిపురం డివిజన్ హిల్స్ కాలనీకి చెందిన మల్లేష్ గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతుండగా అతని బంధువులు స్థానిక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స చేయించారు. రెక్కాడితే కానీ పూటగడవని మల్లేష్ ఆసుపత్రి చికిత్స బిల్లు చెల్లించటం భారంగా మారింది. అందినకాడికి అప్పుచేసి ఎట్టకేలకు బిల్లు చెల్లించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి బాధితుడితో సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేయించారు. సీఎంఆర్ఎఫ్ నుంచి రూ. 1.50 లక్షలు మంజూరు కావటంతో బుధవారం సుధీర్‌రెడ్డి గడ్డిఅన్నారంలోని తన క్యాంప్ ఆఫీస్‌లో లబ్ధిదారుడు మల్లేష్ భార్య పూలమ్మకు చెక్‌ను అందజేశారు. కార్యక్రమంలో డివిజన్ మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు చింతల రవికుమార్‌గుప్తా, నాయకులు శ్రీనివాస్ యాదవ్, కిట్టు తదితరులు పాల్గొన్నారు.

ఆలిండియా హ్యాండ్లూమ్ మేళాకు విశేష స్పందన



హ్యాండ్లూమ్ మేళాలో కొనుగోలుదారుల సందడి

వనస్థలిపురం: వనస్థలిపురంలోని హుడా ఓపెన్ ఆడిటోరియం గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఆలిండియా హ్యాండ్లూమ్ అండ్ హ్యాండీక్రాఫ్ట్ మేళాకు విశేష స్పందన లభిస్తోంది. మేళాలో కొలువైన దుస్తులు, ఇతర ఉత్పత్తుల కొనుగోలుకు స్థానికులు ఆసక్తి చూపిస్తున్నారు. మేళాలో మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, భాగల్‌పూర్, డిజైనర్, కాంతావర్క్, హ్యాండ్ బ్లాక్, ప్రింటెడ్, లినెన్, కలంకారీ, బెంగాల్ కాటన్, బనారస్ చీరలు, లేడీస్ ఫ్యాన్సీ టాప్స్, డిజైనర్ బ్లౌజ్‌లు, లక్నో చికాన్, ఖాదీ మెటీరియల్, వన్‌గ్రామ్ గోల్డ్ జ్యువెలరీ, జైపూర్ బెడ్ షీట్స్, కొండపల్లి బొమ్మలు, గాజులు, బ్యాగులు తదితర ఉత్పత్తులు తగ్గింపు ధరలకు లభిస్తాయని నిర్వాహకుడు అక్బర్ అలీ తెలిపారు. ఈ అవకాశం కొద్ది రోజులు మాత్రమే ఉంటుందని ఆయన అన్నారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో..) టమోటా 11, వంకాయ 18, బెండ 35, పచ్చిమిర్చి 45, కాకర 38, బీర 45, క్యాలీఫ్లవర్ 23, క్యాబేజీ 15, కారెట్ 28, దొండ 23, ఆలు 20, ఉల్లి 14, గోకర 40, దోస 18, సొర 09, పొట్ల 15, అరటి 09, చిక్కుడు 50, అర్వి 28, మునగ 35, చిలగడదుంప 50, బీట్‌రూట్ 21, కీర 15, ఫ్రెంచ్ బీన్స్ 155, కాప్సికమ్ 40. గురువారం 9 గంటల వరకు మాత్రమే ఈ ధరలు అమలులో ఉంటాయి.

లోతట్టు ప్రాంతాల్లో ఇబ్బందులు లేకుండా చర్యలు



నాలా నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

మలక్‌పేట: వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా వరదనీరు సాఫీగా ప్రవహించాలా చర్యలు తీసుకుంటున్నట్లు మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి అన్నారు. శాలివాహననగర్ మ్యాక్సివిజన్ చౌరస్తాలో బుధవారం నాలా పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ప్రజల ఇబ్బందులకు చెక్ పెట్టడానికి చౌరస్తాలో వర్షపు నిల్వకుండా నాలా ఏర్పాటు చేస్తున్నామన్నారు. పనులు సకాలంలో పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. డివిజన్‌లో లోతట్టు ప్రాంతాలలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు సందీప్, దినేష్, లక్ష్మణ్, శ్రీశైలం, నిరంజన్, కాంట్రాక్టర్ సాయిలు తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక గాయత్రి జపం



హరిద్వార్‌లో గాయత్రి జపం నిర్వహిస్తున్న శ్రీరామచంద్రమూర్తి, వేద పండితులు

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్‌కు చెందిన కల్వకొలను చిత్తరంజన్ దాస్ స్మారక సంస్థ, సనాతన ధర్మవారధి వ్యవస్థాపకుడు శ్రీరామచంద్రమూర్తి ఆధ్వర్యంలో గంగా పుష్కరాల్లో భాగంగా హరిద్వార్‌లో బుధవారం 150 మందితో సామూహిక గాయత్రి జపం నిర్వహించారు. అనంతరం సంధ్యావందనంతో పాటు, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక కల్యాణం, సమాజ హితమే తమ ధ్యేయం అన్నారు. కార్యక్రమంలో వేద పండితులు వెంకటరామయ్య, సీతారాం, చంద్రశేఖర్ కులకర్ణి తదితరులు పాల్గొన్నారు.

మోదీ పథకాలు ఇంటింటికీ తీసుకెళ్లాలి



వాల్ పెయింటింగ్ అభియాన్‌ను ప్రారంభిస్తున్న సురేందర్‌రెడ్డి

సైదాబాద్: ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం దేశంలోని అన్నివర్గాల అభ్యున్నతి కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి వివరించాలని బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి సూచించారు. బుధవారం సైదాబాద్‌లో ఆయన పార్టీ నాయకులతో కలిసి వాల్ పెయింటింగ్ అభియాన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతీ ఎన్నికల బూత్‌కు ఐదు చొప్పున సైదాబాద్ డివిజన్ పరిధిలో 285, మలక్‌పేట నియోజకవర్గ పరిధిలో 1500, మొత్తం భాగ్యనగర్ జిల్లాలో 7500 వాల్ పెయింటింగ్ అభియాన్‌లు రూపొందిస్తామన్నారు. కేంద్రంలో మరోసారి మోదీ సర్కార్, తెలంగాణలో ఈసారి బీజేపీ ప్రభుత్వం నినాదాలతో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రజల్లోకి విస్తృతంగా వెళ్తామన్నారు.

జాతీయ సమగ్రతకు యువత పాటుపడాలి: ఏఐవైఎఫ్



ఏఐవైఎఫ్ జెండాను ఆవిష్కరిస్తున్న శ్రీకాంత్

హయత్‌నగర్: ప్రజల మధ్య చిచ్చు పెట్టేందుకు ప్రయత్నిస్తున్న మతతత్వ శక్తులను తరిమికొట్టి, జాతీయ సమగ్రతకు యువత కృషి చేయాలని జాతీయ యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు నేర్లకంటి శ్రీకాంత్ పిలుపునిచ్చారు. సమాఖ్య 64వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బుధవారం ఆయన హయత్‌నగర్‌లో జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... దేశ స్వాతంత్ర్యం కోసం పాణాలు అర్పించిన మహనీయుల ఆశయాల సాధన కోసం 1959లో అఖిల భారత యువజన సమాఖ్య ఆవిర్భవించిందని,18 ఏళ్లు నిండిన యువతకు ఓటు హక్కును కల్పించాలని పోరాటం చేసి విజయం సాధించామన్నారు. సాంఘిక దురాచారాలు, మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రభుత్వరంగ సంస్థలలో స్థానిక యువతకు 50శాతం ఉద్యోగాలు ఇవ్వాలని, ప్రకృతి సంపదను దోచుకుంటూ సంపాదనే మార్గంగా పని చేస్తున్న కార్పొరేట్ శక్తులకు అడ్డుకట్ట వేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అద్యక్షుడు పి. లక్ష్మణాచారి, నియకులు దేవేందర్, రమేష్, శ్రీకాంత్, వెంకటేష్, శోభన్, అశోక్ పాల్గొన్నారు.